# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ సంస్కృతం కాలాతీతమైన జ్ఞానాన్ని అందిస్తూ... భావ వ్యక్తీకరణకు మూలంగా ఉంటూ అన్ని రంగాలపై ప్రభావం చూపుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ రక్షణ రంగంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఉత్పత్తి గరిష్ఠ స్థాయిలో లక్షా 51 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

❖ ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను భారత్ కూల్చివేసినట్లు చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్.. ఏపీ సింగ్ తెలిపారు.

❖ భారతదేశ రక్షణ ఎగుమతులు గత ఏడాది 23 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (DIAT) గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ వెల్లడించారు.

❖ భారతీయ రైల్వేశాఖ 'రౌండ్ ట్రిప్ ప్యాకేజీ' పేరుతో నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది.

==============================

సంస్కృతం కాలాతీతమైన జ్ఞానాన్ని అందిస్తూ... భావ వ్యక్తీకరణకు మూలంగా ఉంటూ అన్ని రంగాలపై ప్రభావం చూపుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ సంస్కృత దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు. గత దశాబ్దంలో సంస్కృత భాషను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేపట్టిందన్నారు. కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాలు, సంస్కృత అభ్యాస కేంద్రాలు ఏర్పాటు, సంస్కృత పండితులకు గ్రాంట్లు అందించడం అందులో భాగమేనని వివరించారు. చేతిరాత ప్రతులను డిజిటలైజ్ చేయడానికి ఉద్దేశించిన `జ్ఞాన్ భారతం మిషన్` ద్వారా అధిక సంఖ్యలో విద్యార్థులు, పరిశోధకులు ప్రయోజనం పొందారని ప్రధానమంత్రి వెల్లడించారు.

==============================

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను భారత్ కూల్చివేసినట్లు చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్.. ఏపీ సింగ్ తెలిపారు. ఈరోజు బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఐదు పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఒక వాయుమార్గ హెచ్చరిక నియంత్రణ వ్యవస్థ (ఏడబ్ల్యూఏసీఎస్) విమానాన్ని భారత్ కూల్చివేసిందని వెల్లడించారు. భారత క్షిపణుల దాడులలో షాబాజ్ జాకోబాబాద్ ఎయిర్‌ఫీల్డ్ ధ్వంసమయ్యిందని, అక్కడ ఉన్న F16 వంటి కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయని చెప్పారు. భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అద్భుతంగా పని చేసిందని ఏపీ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఉత్పత్తి గరిష్ఠ స్థాయిలో లక్షా 51 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి కంటే 18 శాతం వృద్ధిని సాధించిందని పేర్కొంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ మైలురాయిని సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా ప్రసంశించారు. రక్షణ పారిశ్రామిక విభాగాన్ని బలోపేతం చేయడానికి ఇది స్పష్టమైన సంకేతమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ రక్షణ ఎగుమతులు గత ఏడాది 23 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని, రాబోయే రెండు మూడేళ్లలో రెట్టింపు అవుతాయని అంచనా వేస్తున్నట్లు డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం కార్యదర్శి, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (DIAT) గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ తెలిపారు. ఈ రోజు పూణేలో DIAT 14వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మధ్యప్రాచ్య, ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో భారత రక్షణ పరికరాలకు అధిక డిమాండ్ ఉందని అన్నారు. బ్రహ్మోస్ క్షిపణి మినీ వెర్షన్‌ను అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా బెంగళూరులోని కేఎస్ఆర్ రైల్వే స్టేషన్‌లో మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇందులో బెంగళూరు నుండి బెలగావి, అమృత్‌సర్ నుండి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా, నాగ్‌పూర్ (అజ్ని) నుండి పూణే వరకు రైళ్లు ఉన్నాయి. అనంతరం 15 వేల 610 కోట్ల రూపాయల విలువైన బెంగళూరు మెట్రో ఫేజ్-3 ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వేశాఖ 'రౌండ్ ట్రిప్ ప్యాకేజీ' పేరుతో నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా తిరుగు ప్రయాణ టికెట్ బుకింగ్‌పై 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు రైల్వేశాఖ ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొంది. పండగ సమయాల్లో అప్పటికప్పుడు రద్దీని నివారించి ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈనెల 14 నుంచి ఈ ఆఫర్ కింద టికెట్లు బుక్ చేసుకోవచ్చు. రాయితీ వర్తించే తేదీలను ప్రకటిస్తూ... అక్టోబర్ 13 నుంచి 26 మధ్య ప్రయాణించేందుకు టికెట్ బుక్ చేసుకోవాలని తెలిపింది. తిరుగు ప్రయాణం నవంబర్ 17 నుంచి డిసెంబరు 1వ తేదీల మధ్య ఉన్నప్పుడు ఈ పథకం కింద 20 శాతం రాయితీ వర్తిస్తుంది. అయితే, ఈ తిరుగు ప్రయాణం టికెట్ బుకింగ్‌కు ముందస్తు రిజర్వేషన్ కాలం 60 రోజులు నియమం వర్తించదు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సరిహద్దు ఆవల నుండి డ్రగ్స్ సరఫరాను తనిఖీ చేసి, అడ్డుకునేందుకు పంజాబ్ సరిహద్దు జిల్లా తరన్ తారన్ నుండి 'బాజ్ అఖ్' అనే కొత్త యాంటీ-డ్రోన్ సిస్టమ్ (ADS)ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఈరోజు ప్రారంభించారు. సరిహద్దు ఆవల నుంచి డ్రోన్ల ద్వారా డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ఇలాంటి మూడు ఏడీఎస్‌లను ప్రారంభించగా, మరో ఆరు త్వరలో ప్రారంభంకానున్నాయి. సరిహద్దుకు అవతలి వైపు నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించే డ్రోన్‌లను ఈ వ్యవస్థ తక్షణమే అడ్డుకొని నిలిపివేస్తుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... పఠాన్‌కోట్ నుండి ఫాజిల్కా వరకు సరిహద్దులో రెండవ రక్షణ శ్రేణిగా ఈ వ్యవస్థను మోహరిస్తామని చెప్పారు. బీఎస్ఎఫ్ సమన్వయంతో దీన్ని అమలు చేస్తామని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాకోరి రైలు ఘటన విప్లవకారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నివాళులర్పించారు. వంద సంవత్సరాల క్రితం ఇదే రోజున కాకోరి వద్ద దేశభక్తి కలిగిన భారతీయులు చూపిన ధైర్యం వలస పాలనపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని ఎత్తిచూపిందని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చెన్నై సమీపంలోని మహాబలిపురంలో ఈ రోజు జరిగిన ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్ పురుషుల ఓపెన్ విభాగంలో భారత సర్ఫర్లు రమేష్ బుడిహాల్, కిషోర్ కుమార్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మొదటి హీట్‌లో పాల్గొన్న బుడిహాల్ 14.84 స్కోరుతో ఫిలిప్పీన్స్‌కు చెందిన నీల్ సాంచెజ్ కంటే ముందంజలో నిలిచాడు. ఫైనల్ హీట్‌లో పోటీ పడ్డ కిషోర్ 10.50 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో రాబోయే 2-3 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) ఈరోజు అంచనా వేసింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =